సాక్షి వికారాబాద్

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



నిరుద్యోగులతో చెలగాటం

మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ ముద్దు అంటూ డీఎస్సీ అభ్యర్థులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. 8లో▸



మూడోసారి ఓటేస్తే ముప్పే

అవినీతికి పాల్పడుతున్న బీఆర్‌ఎస్ నాయకులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో▸



పనులు పూర్తి చేయాలి

పాఠశాల పనులను వెంటనే పూర్తి చేయాలని పీఆర్‌ఏఈ ప్రవీణ్‌కుమార్ అన్నారు. 9లో▸

ప్రేక్షకులు లేకుండానే క్రికెట్ మ్యాచ్

- బీసీసీఐ, హెచ్‌సీఏ అధికారులతో సమావేశం
- 29న ఉప్పల్ మ్యాచ్‌కు వీక్షకులకు అనుమతి లేదు
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 29న పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న సన్నాహక మ్యాచ్‌కు ప్రేక్షకులకు అనుమతి లేదు. ఈమేరకు రాచకొండ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ బీసీసీఐ, హెచ్‌సీఏ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఇరు జట్ల క్రీడాకారులతో పాటు బీసీసీఐ/ఐసీసీ అధికారులు తప్ప సాధారణ వీక్షకులకు ప్రవేశం లేదని చెప్పారు. క్రికెట్ ప్రపంచ కప్ పోటీలు ప్రతిష్టాత్మకమైనవి కాబట్టి క్రీడాకారులకు ఎలాంటి శాంతి భద్రత సమస్యలు లేకుండా చూడాలని పోలీసుల సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ డీజీపీ (సీఆర్‌పీఎఫ్) దుర్గాప్రసాద్, డీసీపీ అభిషేక్ మహంతి, ఎస్‌ఓటీ డీసీపీ గిరిధర్, డీసీపీ రోడ్ సేఫ్టీ శ్రీబాల, ఏసీపీలు నరేష్ రెడ్డి, శ్రీనివాస్, బీసీసీఐ, హెచ్‌సీఏ అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి, హరీశ్ రావు



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

అభిమాన నేతకు అంతిమ వీడ్కోలు

- హరీశ్వర్‌రెడ్డిని కడసారి చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- జనసంద్రంగా మారిన పరిగి వీధులు
- ప్రముఖుల రాకతో భారీ బందోబస్తు

పరిగి: ఆయన ప్రజల నుంచి పుట్టిన నాయకుడు.. చివరి శ్వాస వరకు ప్రజాశ్రేయస్సు కోసమే తపించిన నేత.. రాష్ట్ర స్థాయిలో పరిగి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతలను తెచ్చిపెట్టిన మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్‌రెడ్డి శుక్రవారం రాత్రి గుండె పోటుతో కన్నుమూశారు. ఐదు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్‌గా ఎదిగారు. ఆయన కడసారి చూపు కోసం అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో పరిగి వీధులు జనసంద్రాన్ని తలపించాయి.

రాజకీయ నేపథ్యం

1947 మార్చి 18న పరిగి గ్రామంలో జన్మించారు హరీశ్వర్‌రెడ్డి. వార్డు మెంబర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 1972 నుంచి 1977 వరకు ఉప సర్పంచ్‌గా, 1977- 83 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోపరిగి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోదిగి కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ షరీఫ్ చేతిలో 56 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందారు. అనంతరం ఆయన టీడీపీలో చేరి 1985 మధ్యంతర ఎన్నికల్లో షరీఫ్‌పై 32,512 ఓట్ల మెజార్టీతో తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1986-88 వరకు ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా, 1988-89 వరకు టీటీడీ బోర్డు మెంబర్‌గా పనిచేశారు. 1990 ఎన్నికల్లో కమతం రామ్‌రెడ్డి చేతిలో ఓటమి పాలైన కొప్పుల 1994, 1999, 2004, 2009 వరకు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1997 నుంచి 2003 వరకు రాష్ట్ర ఆర్థిక సంస్థ అధ్యక్షుడిగా, 2003 నవంబర్ 14 వరకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2012 నవంబర్ 15న టీడీపీని వీడి టీఆర్‌ఎస్‌లో చేరి పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమితులయ్యారు. 2014 ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి చేతిలో 5,163 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. హరీశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించారు.



గాలిలోకి కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలతో హరీశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు

సీఎం కేసీఆర్‌తో అత్యంత సన్నిహితుల్లో హరీశ్వర్ రెడ్డి ఒకరు. తను అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో టీఆర్‌ఎస్ టికెట్‌ను పెద్ద కుమారుడు మహేశ్‌రెడ్డికి కేటాయించారు. ఆయన ప్రస్తుతం పరిగి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

ప్రజాదరణ పొందిన నాయకుడు

కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ప్రజాదరణ పొందిన నాయకుడు. నిత్యం ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరిస్తూ మంచి పేరు ప్రతిష్టలు గడించారు. ఆయన ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది నిరుపేదలకు సేవలందించారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమించారు. ప్రజలను అన్న, తమ్మి, కాకా అంటూ వరుసలతో పిలుస్తూ కుటుంబ సభ్యుడిగా కలిసిపోయిన మహా నాయకుడు హరీశ్వర్‌రెడ్డి. ఏచిన్న కార్యమైనా.. ఆపదలో ఉన్నా వెంటనే స్పందించి వారికి తన వంతుగా సాయమందిస్తూ ఉండేవారు. ఆయన లేడనే వార్తను ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖుల రాకతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం కోసం నిరసన



రేషన్‌షాపు వద్ద లబ్ధిదారుల ఆందోళన

దౌల్తాబాద్: రేషన్‌బియ్యం సకాలంలో పంపిణీ చేయడం లేదని మండల పరిధిలోని గుముడాల గ్రామ లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. గతంలో పనిచేసిన డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన్ను మార్చారు. మండల పరిధిలతోని తిమ్మారెడ్డిపల్లి డీలర్ రాంచందర్‌కు పంపిణీ బాధ్యతలు అప్పగించారు. కాగా లబ్ధిదారులు శనివారం రేషన్ షాపునకు వెళ్లి తమకు నాలుగు నెలలుగా బియ్యం పంపిణీ చేయడం లేదని నిరసన చేపట్టారు. స్పందించిన రాంచందర్ తాను కొత్తగా వచ్చానని తానేమి చేయలేనన్నారు. ఇదే విషయమై డీటీ చాంద్‌పాషాను వివరణ కోరగా గతంలో ఉన్న డీలర్‌ను మార్చామని.. ఇక నుంచి సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న భారతి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి.. తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన దీక్షలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా సభ్యులు లక్ష్మి, శారద, ప్రమీల, మనోహర, సులోచన, రిక్కీబాయి, నూర్జహాన్, సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కొడంగల్ ప్రాజెక్టు నియోజకవర్గ కార్యదర్శి కె.నవనీత, ఉపాధ్యక్షురాలు శివలీల, టీచర్లు జయమ్మ, వినోద, వెంకటమ్మ, రత్నాబాయి, హెల్పర్లు జ్యోతి, ఆనందమ్మ, కిష్టమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

ఏఐసీఎఫ్ చేవెళ్ల పార్లమెంట్ పర్యవేక్షకుడిగా యేసుదాసు



నియామకపత్రం అందుకుంటున్న యేసుదాసు

పరిగి: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ చేవెళ్ల పార్లమెంట్ పరివేక్షకుడిగా బిషప్ బుప్పడి యేసుదాసును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు బ్రదర్ గద్దపాటి విజయరాజు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యేసుదాసు మాట్లాడుతూ.. క్రిస్టియన్‌ల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

హస్తం గూటికి బీఎంఆర్..?

- కాంగ్రెస్‌లో చేరతారంటూ ప్రచారం
- ఇప్పటికే కండువా కప్పుకున్న ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి
- ఉత్కంఠ రేపుతున్న తాండూరు రాజకీయాలు



వికారాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్న బుయ్యని మనోహర్‌రెడ్డి త్వరలో హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జోరందుకుంది. తాజాగా శనివారం ఆయన సోదరుడు కాంగ్రెస్ కండువా కప్పుకోవటం ఇందుకు బలాన్ని చేకూరుస్తుంది. ఇప్పటికే పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ద్వారా కాంగ్రెస్ పెద్దలతో మంతనాలు జరిపిన మనోహర్‌రెడ్డి త్వరలోనే పార్టీలో చేరేందుకు ముహూర్తం చూసుకుంటున్నారని చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల సమయంలోనే పరిగి టికెట్ ఆశించి భంగపడిన ఆయన ఈ ఎన్నికల్లో ఎలాగైనా పోటీలో ఉండాలనే పట్టుతో ఉన్నారు. గతేడాదిగా బీఆర్‌ఎస్‌లో పట్నం వర్సెస్ ఎమ్మెల్యేలుగా విడిపోయారు. తాజాగా మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి కట్టబెట్టడంతో విబేధాలు పైకి సద్దుమనిగినట్టు కనిపిస్తున్నా.. లుకలుకలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఈ వర్గపోరులో మహేందర్‌రెడ్డి అనుచరుడిగా ఉన్న మనోహర్‌రెడ్డి పరిగి అసెంబ్లీ టికెట్ ఆశించిన విషయం విదితమే.

అజ్ఞాతంలో డీసీసీబీ చైర్మన్

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి ఏడాది కాలంగా తన సొంత నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి పోటీగా తనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకున్నాడు. ఓ పక్క బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తూనే కాంగ్రెస్ నేతలతోనూ మంతనాలు జరుపుతున్నారనే ప్రచారం కొనసాగింది. కాగా బీఆర్‌ఎస్ నుంచి మహేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి టి.రామ్మోహన్‌రెడ్డి ఇద్దరూ బలమైన నేతలవ్వడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని ఇరు పార్టీలు తిరస్కరించాయి. దీంతో దాదాపుగా పక్షం రోజులుగా అజ్ఞాతంలో ఉన్న బీఎంఆర్ తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఆయనకు కాంగ్రెస్ పార్టీ తాండూరు నుంచి టికెట్ హామీ లభించిందని సన్నిహితులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం ఇక్కడ నుంచి ఆరుగురు ఆశావహులు దరఖాస్తు చేసుకోగా చివరకు పీసీసీ కార్యదర్శి రఘువీరారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మధ్య పోటీ నెలకొందంటూ నిన్నటి వరకు ప్రచారం సాగింది. కేఎల్‌ఆర్‌కు తాండూరు టికెట్ దాదాపు ఖాయమయిందనే ప్రచారం ఊపందుకున్న తరుణంలో అనూహ్యంగా మనోహర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. దీంతో ప్రస్తుతం తాండూరు అసెంబ్లీ టికెట్ హాట్ టాపిక్‌గా మారింది.

పరిగిలోనూ ప్రభావం

రెండేళ్లుగా పరిగి నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తూ వచ్చిన మనోహర్‌రెడ్డి నియోజకవర్గంలో తనకంటూ ఓ వర్గాన్ని తయారు చేసుకున్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన లిస్ట్‌లో ఆయన పేరు లేకపోవడంతో ఆయన అనుచరులు పలువురు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి వర్గంలో చేరగా.. మరికొందరు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో మనోహర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే ఆయన అనుచరులు కాంగ్రెస్‌లో చేరడం లేదా అధికార పార్టీలోనే ఉంటూ అంతర్గతంగా హస్తం పార్టీకి మద్దతు తెలిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన తాండూరు నుంచి పోటీలో ఉన్నప్పటికీ.. పరిగిలోనూ ప్రభావం ఉంటుందని.. అది కాంగ్రెస్‌కు లాభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఘనంగా ‘పట్నం’ జన్మదిన వేడుకలు



మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డిని సత్కరిస్తున్న అభిమానులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, ఆనంద్, పట్నం నరేందర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, రోహిత్ రెడ్డి ఆయనకి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు కేఎస్ రత్నం, ఉప్పల్ టీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి బండారు, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు సాగర్ గౌడ్, మంద రవీందర్ రెడ్డి, శ్రీలత సురేష్ గౌడ్, పాపయ్య తదితరులతో పాటు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న సతీష్, రంగారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌లు తీగల అనితారెడ్డి, పట్నం సునీతా రెడ్డి, జెడ్పీటీసీలు కాలె శ్రీకాంత్, అవినాష్ రెడ్డి, మాలతి, ఎల్బీనగర్ మాజీ ఇన్‌చార్జి రామ్మోహన్ గౌడ్, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సహకార సంఘాల చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు.

కేసీఆర్‌కు ఎవరూ సాటిలేరు



మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించి కూరగాయల విక్రేతలతో ముచ్చటిస్తున్న మంత్రి సబితారెడ్డి

- ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయనది ప్రత్యేక ముద్ర
- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించడంలో సీఎం కేసీఆర్‌కు ఎవరూ సాటిరారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. కందుకూరులో రూ.2.67 కోట్ల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు ఓపెన్ జిమ్, కూరగాయల మార్కెట్‌ను శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. చౌరస్తాలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 300 మంది పేదలకు ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలకు 75 గజాల చొప్పున 8 ఎకరాల్లో లేఅవుట్ వేసి ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తున్నామని, ఇది తమ పిల్లలకు కేసీఆర్ ఇచ్చిన బహుమతిగా భావించాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. మెట్రో రైలు కందుకూరు మీదుగా ముచ్చర్ల గేటు వరకు ఏర్పాటు చేయాలని ముఖ్య మంత్రి నిర్ణయం తీసుకున్నారన్నారు. మెడికల్ కళాశాల, న్యాయ విద్య కళాశాలల ఏర్పాటు కానున్నాయన్నారు. బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి కేసీఆర్ రుణం తీర్చుకోవాలన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ సీఎం చేయని విధంగా కేసీఆర్ ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎస్.శమంతకమణి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మనుషుల జీవితమే ‘మట్టి కథ’

- డైరెక్టర్ పవన్ కడియాల

తాండూరు టౌన్: మట్టి మనుషుల జీవితమే మట్టికథ సినిమా అని సినిమా డైరెక్టర్, తాండూరు వాసి పవన్ కడియాల అన్నారు. శనివారం సినిమా విడుదల సందర్భంగా పట్టణంలోని లక్ష్మి మహల్‌లో నటుడు నరేశ్‌తో కలిసి ఆయన సందడి చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇంటర్ విద్యను అభ్యసించిన అంబేద్కర్ జూనియర్ కళాశాల యాజమాన్య సభ్యురాలు విజయాదేవితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కష్టజీవుల జీవితగాదను కళ్లకు కట్టినట్లుగా చూపించాలనే ఈ సినిమా తెరకెక్కించామన్నారు. ఈ సినిమా తొమ్మిది అంతర్జాతీయ అవార్డులను అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సింధు కళాశాలల యాజమాన్య సభ్యురాలు, కౌన్సిలర్ విజయాదేవి మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలు దాగి ఉంటాయనే దానికి నిదర్శనమే పవన్ కడియాల అన్నారు. అనంతరం థియేటర్‌లో పవన్ తో పాటు చిత్రబృందం సందడి చేసింది



డైరెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మహిళలు

ఏడాదికే మూత!

రేబిస్ వ్యాధి నివారణ, నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ రేబిస్ నియంత్రణ(ఎన్‌ఆర్‌సీపీ) కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా వీధి కుక్కలకు జనన నియంత్రణ, యాంటీ రేబిస్ టీకా వేయించడం తదితరాల కోసం ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)ను ప్రారంభించారు. మున్సిపాలిటీలు వీటి నిర్వహణకు బిల్లులు చెల్లించకపోవడంతో సెంటర్‌లు మూత పడుతున్నాయి.

- ఏబీసీ సెంటర్ నిర్వహణకు అందని బిల్లులు
- ఆరు నెలలుగా నిలిచిన శస్త్ర చికిత్సలు
- పెరుగుతున్న శునకాల సంఖ్య



వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీ కేంద్రంలో ఏడాది క్రితం ఏబీసీను ప్రారంభించారు. దీంతో వీధి కుక్కల దాడులు కొంతమేర తగ్గాయి. ఆరు నెలలు సజావుగానే సాగిన ఈ సెంటర్ సత్ఫలితాలిచ్చింది. కాగా మున్సిపల్ అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలల క్రితం అకస్మాత్తుగా ఈ కేంద్రాన్ని మూసివేసినట్లు సమాచారం. ప్రధానంగా కుక్కల బెడదతో పాటు రేబిస్ వ్యాధిని అరికట్టేందుకు ఈ సెంటర్ ఎంతో పనిచేసింది. ఏడాది పాటు కొనసాగిన ఈ సెంటర్‌లో 1,492 కుక్కలకు సంతానం కలగకుండా ఆపరేషన్లు పూర్తి చేశారు.

శునకానికి రూ.99 చొప్పున బిల్లు

వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట్ చెరువు పక్కనే ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ఏర్పాటుకు రూ.5లక్షలు వెచ్చించి రేకుల షెడ్ నిర్మించారు. పక్కనే ఉన్న భవనంలో ఆపరేషన్ థియేటర్, సర్జికల్ రూం, సిబ్బందికి రెండు గదులు కేటాయించారు. గతేడాది మేలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. యూపీకి చెందిన ఓ ప్రైవేటు వ్యక్తికి కాంట్రాక్టు ఇచ్చారు. నిబంధనల ప్రకారం కుక్కకు ఆపరేషన్ చేసిన తర్వాత వారం నుంచి పది రోజుల పాటు వారి సంరక్షణలోనే భోజనం పెట్టాలి. అందుకు ఒక్కో కుక్కకు రూ.99 చొప్పున చెల్లించాలి. ఏడాదిలో 1,492 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయగా వేయి కుక్కల ఆపరేషన్ల బిల్లులు చెల్లించకపోవడంతోనే సెంటర్ మూత పడిందని పలువురు చర్చించుకుంటున్నారు.

నైపుణ్యాల గుర్తింపునకే 'ప్రగతి పరీక్షలు'



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి

కుల్కచర్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు ప్రగతి నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కుల్కచర్ల కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. శనివారం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక అంశాల్లోనూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- ఇంటికో కొలువంటూ మోసం చేసిన కేసీఆర్
- మాజీ మంత్రి, అభ్యర్థుల మండిపాటు
- మెగా డీఎస్సీ వేయాలంటూ డిమాండ్



వికారాబాద్ అర్బన్: ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఇంటికో కొలువు ఇస్తానని చెప్పిన కేసీఆర్.. తెలంగాణ వచ్చాక ఉన్న ఉద్యోగాలను తొలగించి, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ ఆరోపించారు. శనివారం డీఎస్సీ అభ్యర్థులు మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ వేయాలని కోరుతూ ఎన్టీఆర్ చౌరస్తాలో మానవ హారం నిర్వహించి నిరసన వ్యక్తంచేశారు. వీరికి మాజీమంత్రి సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేసీఆర్ మోసపూరితమైన హామీలు ఇస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను అన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకొని, ఏళ్లుగా నిరుద్యోగులు ఇంటికి దూరంగా ఉంటూ చదువుకుంటున్నారని, కంటి తుడుపు చర్యగా ఐదు వేల పోస్టులు భర్తీ చేయడం దారుణమని మండిపడ్డారు. జిల్లాలో కొన్ని కేటగిరీల వారికి ఒక పోస్టు కూడా లేకపోవడం నిరుద్యోగులను తీవ్రంగా కలచివేసిందని వాపోయారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి డీఈడీ, బీఈడీ పూర్తి చేశాక పోస్టులు లేవని తెలియడంతో మనస్తాపం చెందుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెగా డీఎస్సీని వేయాలన్నారు. నిరుద్యోగులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. నిరసనలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారు.

పరీక్షకు నాలుగు నెలల సమయం..

తాండూరు టౌన్: మినీ డీఎస్సీని విరమించుకుని మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేస్తూ పలువురు నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు తాండూరు పట్టణం అంబేడ్కర్ చౌక్‌లో ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినదించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్వ సుజాత, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, బీసీ సంఘం సభ్యుడు సయ్యద్ షకూర్, లక్ష్మణాచారీ, విద్యార్థి నాయకులు శివకుమార్, దీపక్ రెడ్డిలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తానని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. మాట తప్పిందని ఆరోపించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా కేసీఆర్ నిరుద్యోగులను దగా చేస్తున్నారని విమర్శించారు. బదిలీలు, ఉద్యోగ విరమణలతో పాటు భర్తీ చేయాల్సిన పోస్టులు అన్నీ కలిపి 23వేలకు పైగానే ఉన్నాయని, వాటిని మెగా డీఎస్సీ రూపంలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ సిలబస్ చాలా ఎక్కువగా ఉందని, సమయం తక్కువగా ఉందని, కావున పరీక్షకు నాలుగు నెలల సమయం ఇవ్వాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్, బీసీ నాయకులు మతిన్, సురేందర్ ఉన్నారు.



తాండూరు టౌన్: అంబేడ్కర్ చౌక్‌లో ఆందోళన చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు, నాయకులు

ఉర్దూ పోస్టులు పెంచాలి



కలెక్టరేట్ వద్ద డీఎస్సీ అభ్యర్థులు

అనంతగిరి: డీఎస్సీ ప్రకటనలో ఉన్న ఉర్దూ పోస్టులను ప్రభుత్వం పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉర్దూ మీడియం డీఎస్సీ అభ్యర్థులు కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈవో రేణుక దేవిలకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఉర్దూ మాధ్యమంలో తక్కువ పోస్టులు చూపిస్తూ నోటిఫికేషన్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చెప్పిన విధంగా ఉన్న పోస్టులను జతచేసి రీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

అగ్రవర్ణాలకే అనుకూలం

కేశంపేట: మహిళ బిల్లు అగ్రవర్ణ మహిళలకే అనుకూలంగా ఉందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాకేశ్ ఆరోపించారు. మహిళా బిల్లును వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి, దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ మహిళ రిజర్వేషన్ బిల్లుతో బీసీ,ఎస్సీ,ఎస్టీలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. బిల్లులో ఉప కులాల కోటా కేటాయించాలన్నారు.

'కారు'దిగి 'హస్తం'గూటికి

- కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నేతలు
- సోదరుడి వెంటే డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి?



తాండూరు: కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంపత్‌కుమార్

తాండూరు/కుల్కచర్ల: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాండూరు పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునిత భర్త, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త, డీసీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డిలు అధికార పార్టీని వీడి ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరిరువురికి పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో తాండూరు గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ పెద్దలు సూచించారు. మరోవైపు డాక్టర్ సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డిలు తాండూరు టికెట్ ఆశిస్తున్నారని, అందులో భాగంగా టికెట్ ఇవ్వాలని నేతలను కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. తన సోదరుడు మనోహర్‌రెడ్డికి కూడా టికెట్ ఇవ్వాలని శ్రీనివాస్‌రెడ్డి కోరినట్లు తెలుస్తోంది.

మనోహర్ రెడ్డి పయనమెటు?

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి పరిగి నియోజకవర్గం నుంచి అధికార పార్టీ బీఆర్ఎస్ టికెట్ ఆశించినా దక్కపోవడంతో ఆయన సైలెంట్ అయిపోయారు. దీంతో ఆయన కుటుంబీకులు, అనుచరులు ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు. శనివారం ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో చర్చనీయాంశంగా మారింది. మనోహర్ రెడ్డి కూడా కాంగ్రెస్ గూటికి చేరతారా అనే చర్చ జరుగుతోంది.

మూడోసారి ఓటేస్తే అందరికీ ముప్పే

- పేదల భూములను గుంజుకుంటున్న బీఆర్ఎస్
- ముఖ్యమంత్రి కేసీఆర్‌ది రాక్షసపాలన
- మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ధ్వజం
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

ధారూరు: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులను ఉపేక్షించేది లేదని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరు మండలం రుద్రారంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పేదల వద్ద గుంజుకుని తినే పార్టీ బీఆర్ఎస్ అని ఎద్దేవా చేశారు. ఇలాంటి పార్టీకి రెండుసార్లు ఓటేసి తప్పుచేశామని, మూడోసారి వేస్తే అందరికీ ముప్పు తప్పదన్నారు. మన పైసలతో మన ఓట్లు కొని, సీఎంగా కేసీఆర్.. రాక్షస పాలన చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కూడా రావనాసురుడి తమ్ముడిలా తయారయ్యారని ఆరోపించారు.

కారుచౌకగా భూముల లూటీ

మోమిన్‌పేట్ మండలం ఎన్కతలలో 12 వేల ఎకరాల పేదల భూములను ఎకరాకు రూ.16 లక్షల చొప్పున లూటీ చేసిన కేటీఆర్.. అదే భూమిని ఓ కంపెనీకి రూ.1.50 కోట్లకు ఎకరా చొప్పున అమ్ముకున్నారని విమర్శించారు. ఇంకా కొన్ని ఊర్లలో భూముల కబ్జాకు సర్వేలు చేస్తున్నారని, దన్నారం, బురంతపల్లి గ్రామాల్లో భూములు గుంజుకునేందుకు యత్నిస్తున్నారని, ఆ అవకాశాన్ని మనం ఇవ్వరాదన్నారు. భూములను గుంజుకున్న వారి నుంచి రానున్న కాంగ్రెస్ ప్రభుత్వం విడిపించి, పేదలకే పంచుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఎప్పుడు అబద్ధం చెప్పదని, కేసీఆర్ టోపి పెట్టి అబద్ధాలు మాట్లాడుతూ బిడ్డ, కొడుకు, అల్లుడు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ధ్వజమెత్తారు. వికారాబాద్‌లో ఇద్దరు కాంగ్రెస్ వారు పోటాపోటీగా నిలబడితే ఓట్లు చీలిపోయి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆనంద్ గెలుపొందారని ఆయన గుర్తు చేశారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి వైపు చూడటం లేదని, ఎప్పుడూ దోచుకునే ఆలోచనలోనే ఉంటున్నారని ఆరోపించారు. ఆయన ఎక్కడెక్కడ దోచుకున్నది, కబ్జాలు చేసింది మొత్తం ప్రజల ముందు పెడతానని హెచ్చరించారు.

ఇద్దరికీ పింఛన్

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇంటికి ఒకే ఫించన్ ఇస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇంట్లో ఇద్దరికీ రూ.4 వేల చొప్పున పంపిణీ చేస్తామని, దళితబంధు అర్హులదరికీ ఇస్తామని చెప్పారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ అభయహస్తం తెల్లరేషన్ కార్డున్న ప్రతి ఎస్సీ కుటుంబానికి రూ.12 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దుచేస్తామన్నారు. సమావేశానికి ముందు రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ కిష్టయ్య ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికీ మాజీమంత్రి పార్టీ కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, నాయకులు మల్‌రెడ్డి, మహ్మద్ బాబాఖాన్, రమేశ్‌కృష్ణ, లాల్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి ఎల్.అశోక్, టి.మల్లేశ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్

వికారాబాద్ అర్బన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాలల సంక్షేమ సమితి చైర్మన్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మహిళా సంక్షేమ శాఖ, మిషన్ వాత్సల్య పథకం ఆధ్వర్యంలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలనే విషయాన్ని అందరికీ చెప్పాలని సూచించారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా పాల్పడితే కఠిన శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా ఉంటుందని చెప్పాలన్నారు. గత ఏడాది 155 బాల్య వివాహాలను నిల్పివేయడంతో పాటు, పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు ఎటువంటి ఇబ్బందులకు గురైనా టోల్ ఫ్రీ నంబర్ 1098, 100, 181ను సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఐఈఓ శంకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర్ స్వామి, బాలల సంక్షేమ సమితి సభ్యుడు ప్రకాష్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ లక్ష్మణ్, సోషల్ వర్కర్ వనమాల, జ్యోతి, వీరమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే 'ఆరోగ్య రథం'

- సీఎం ఆదేశాలను ఆచరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు
- కేసీఆర్ పదికాలాలు పదవిలో ఉంటే అందరికీ మేలు
- ఎమ్మెల్యే కాలె యాదయ్య



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెలే తదితరులు

నవాబుపేట: ప్రజారోగ్యం కోసమే 'ఆరోగ్య రథం' సేవలను ఎంపీ రంజిత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధి ఆర్కతలలో శనివారం ఆరోగ్య రథం సేవలను ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. సీఎం ఆదేశాలను, ఆయన ఆలోచన విధానాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ఆచరిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం పేదలకు చేసిందేమి లేదని, కేసీఆర్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. అలాంటి ముఖ్యమంత్రి పది కాలాల పాటు పదవిలో ఉంటే ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సర్పంచులు నర్సింహులు, పర్మయ్య, రత్నం, మాణిక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, మల్లారెడ్డి, రంగారెడి, ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, మల్లేషం, ప్రకాశం, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నేలలు సారవంతం

వ్యవసాయ శాస్త్రవేత్త నరేందర్‌రెడ్డి



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వినియోగాన్ని పెంచితే నేలలు మరింత సారవంతంగా మారుతాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్లాపూర్‌లో పలువురు రైతులు సాగు చేసిన పంటలను ఆయనతో పాటు మరికొంత మంది శాస్త్రవేత్తలు పరిశీలించారు. అనంతరం వారు రైతులకు పంటల సాగులో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముఖ్యంగా రైతులు పంటల సాగుపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వచ్చే పంటలు, మార్కెటింగ్ సదుపాయాలపై సంబంధిత వ్యవసాయ అధికారులతో వివరాలు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, శైలజ, అరుణ, శకుంతలదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లలో స్థానికులకు అన్యాయం



ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నేతలు, స్థానికులు

ఇబ్రహీంపట్నం: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం చేశారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రవీంద్రచారి ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇబ్రహీంపట్నంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికేతరులకు ఇళ్లను కేటాయించి స్థానికులకు అన్యాయం చేయడం తగదన్నారు. స్థానికులకు 60 శాతం కేటాయించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పాలకులు విస్మరిస్తున్నారన్నారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఇళ్ల కేటాయింపులో న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా, ముత్యాల యాదిరెడ్డి, కృష్ణ, నీలమ్మ, లక్ష్మయ్య, సంజీవ, లక్ష్మణ్, హరిసింగ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు ఇద్దరు బలి

ఇబ్రహీంపట్నం: వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు బలైన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామ శివార్లలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైర్ తగిలి షాక్ గురై జి రాజశేఖర్(29) అక్కడికక్కడే మృతిచెందారు.

ఉప్పరిగూడలో...

ఉప్పరిగూడలో ఎ. చంద్రారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో టిప్పర్‌తో మట్టిని అన్‌లోడ్ చేసేందుకు హైడ్రాలిక్‌ను ఎత్తగా ట్రక్ పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. ఈ విషయాన్ని గమనించక క్లీనర్ ఎ.అబ్బయ్య(35) వెనుక ఉన్న ట్రక్‌రాడ్ తీయడంతో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి కిందపడిపోయాడు. వెంటనే నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

చేవెళ్ల: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి ఆకాంక్షించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆమె సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేజీబీవీలోని పాఠశాల వసతులను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజ్యాంగం విద్యార్థులకు అనేక హక్కులను కల్పించిందని, వాటిని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మోసపూరితమైన వ్యక్తుల గురించి విద్యార్థులకు తెలిపారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆన్‌లైన్ మోసాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్వేతా, బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎస్. చంద్రశేఖర్, కుమార్, డి. శ్రీనివాస్, కె.మహేందర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ రామాంజనేయులు, ఎస్ఐ ప్రసాద్‌లు

ఇబ్రహీంపట్నం: రోజురోజుకు పెరుగుతున్న ఇంటర్నెట్ సేవలతో పాటు సైబర్ మోసాలు కూడా బాగా పెరుగుతున్నాయని ఎస్ఐ మైబెల్లి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని కార్తికేయ, వాసవీ కళాశాలల్లో శనివారం సైబర్ క్రైం అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మెసేజ్‌కు, మెయిల్‌కు స్పందించొద్దన్నారు. మనకు తెలిసిన వ్యక్తులా కాదా అని నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ద్వారా మహిళలను వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలను నిరోధించేందుకు యువత పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అత్యవసర సమయల్లో 8712662662 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బాబురావు, మీనాకుమారిలు పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. సీఐ రామాంజనేయులు, ఎస్ఐ ప్రసాద్‌లు విద్యార్థులకు ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, పోలీసుల విధులు, సమయపాలన, సైబర్‌క్రైమ్స్, 100కు కాల్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఉండే సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పని తీరుపై అవగాహన కల్పించారు.

కారు ఢీకొని రైతు మృతి

శంకర్‌పల్లి: కారు ఢీకొని రైతు మృతి చెందిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏర్వగూడ గ్రామ శివారుల్లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏర్వగూడ గ్రామానికి చెందిన ముత్తంగి శ్రీశైలం (45) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. శనివారం సాయంత్రం పని నిమిత్తం స్కూటీపై శంకర్‌పల్లి వచ్చి తిరిగి వెళ్తుండగా ఏర్వగూడ గేటు వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రైతు శ్రీశైలం అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడి చేరుకొని కారులో ఉన్న నాలుగురిలో ఇద్దరు పారిపోగా, మరో ఇద్దరిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. మృతుడికి భార్య రాజమణి, కూతుర్లు మౌనిక, నికిత, కుమారుడు వంశీ ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.